మహిళల చేతుల్లో నైపుణ్యం..
స్వయం ఉపాధికి బాట



3లో..

www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

గణేష్ నిమజ్జనం కు ఏర్పాట్లు



3వ పేజీల్లో

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 230, సోమవారం 21-9-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam

## దళితుల భూముల్లో అంగుళం కూడా తీసుకోం..

# ఆయన మాటలు నమ్మొద్దు

- కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణ నేపథ్యంలో దళిత రైతులకు నోటీసులు
- దళితుల భూములపై మంత్రి పొంగులేటి భరోసా
- భూ రికార్డుల పరిశీలన హక్కుల పరిరక్షణకేనని, భూసేకరణ కాదని వివరణ
- కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపణ
- దళితులు, గిరిజనుల భూ హక్కులకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ



రాష్ట్రంలోని దళితుల భూముల్లో అంగుళం కూడా ప్రభుత్వం తీసుకోదని, వారి భూములకు పూర్తి భద్రత కల్పిస్తామని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం స్పష్టం చేశారు. దళితులు, గిరిజనుల భూములను లాక్కోవడం ప్రజల ప్రభుత్వ విధానం కాదని ఆయన తేల్చిచెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం దళితుల భూములకు పూర్తి రక్షణ కవచంగా నిలుస్తుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు.

## తెలంగాణకు భారీ వర్ష సూచన.. మూడు రోజులు అప్రమత్తం

- బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా తెలంగాణకు వర్ష సూచన
- రానున్న మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం
- సోమవారానికి వాయుగుండంగా, మంగళవారానికి తీవ్ర వాయుగుండంగా బలపడనున్న అల్పపీడనం
- గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులు
- సెప్టెంబర్ 24న పలు జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక

బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉండటంతో తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు బలమైన ఈదురుగాలులు కూడా వీస్తాయని ఆదివారం విడుదల చేసిన బులెటిన్‌లో స్పష్టం చేసింది.






## ఎల్ నినో కంటే రేవంత్ రెడ్డే

# ప్రమాదకరం

- అవకాశం ఉన్నా కరెంట్ ఇవ్వకుండా లేని కరవును సృష్టిస్తున్నారంటూ హరీశ్ రావు ఫైర్
- 24 గంటల కరెంట్ పోయి 6-7 గంటలకే పరిమితమైందని విమర్శలు
- మూడు పంటల నుంచి రైతుబంధు పెండింగ్‌లో పెట్టారని ఆరోపణ
- పిట్ట బెదిరింపులకు భయపడేది లేదని ప్రభుత్వానికి హెచ్చరిక

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రకృతి విపత్తు అయిన ఎల్ నినో కంటే రేవంత్ రెడ్డే రాష్ట్రానికి అత్యంత ప్రమాదకరమని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే కరెంట్ కోతలు విధిస్తూ, నీళ్లు ఇవ్వకుండా రైతులను ఇబ్బంది పెడుతోందని, రాష్ట్రంలో లేని కరవును సృష్టిస్తోందని ఆరోపించారు.



## నేను వాళ్లూ, వీళ్లూ వదిలిన బాణాన్ని కాదు: కవిత

కొడంగల్‌లో పాంచజన్య సంకల్ప సభ

కొడంగల్ గడ్డపై నుంచి చెబుతున్నా.. నేను ఎవరి బాణాన్ని కాదు అంటూ కవిత వ్యాఖ్యలు

అధికారానికి దూరంగా ఉన్న బహుజనుల బాణాన్ని నేనని వ్యాఖ్య

యువత, బహుజనుల కోసం ఎవరితోనైనా పోరాడుతానని ప్రకటన

అక్షరాస్యత విషయంలో సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించిన కవిత:

తాను వాళ్లూ వీళ్లూ వదిలిన బాణాన్ని కాదని, దశాబ్దాలుగా అధికారానికి, విద్యకు దూరంగా ఉన్న బహుజనుల బాణాన్ని అని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. యువత, బహుజనుల హక్కుల కోసం ప్రధాని మోదీ, సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్‌తో అయినా కొట్లాడటానికి సిద్ధమని ఆమె ప్రకటించారు. వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో ఆదివారం నిర్వహించిన 'పాంచజన్య సంకల్ప సభ'లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసం గించారు.

# విదేశాంగ శాఖ మంత్రికి 'సర్' నోటీసు..!



కేంద్ర ఎన్నికల సంఘం తీసుకొచ్చిన ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా.. సామాన్యుల నుంచి రాజకీయ ప్రముఖులు, కేంద్ర మంత్రులు కూడా నోటీసులు ఎదుర్కొంటున్నారు. తాజాగా విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జై శంకర్ కూడా నోటీసులు అందుకున్నారు. ఢిల్లీలో సర్ ప్రక్రియలో భాగంగా ఆదివారం జై శంకర్ ఆయన సతీమణి క్యోకో జై శంకర్‌కు ఈ లేఖలు అందాయి. వీరితో పాటు సీబీఐ డైరెక్టర్, మాజీ ఆర్మీ అధికారులు సర్ నోటీసులు అందుకున్నారు.ఓటరు జాబితాలో సవరణలో భాగంగా దేశవ్యాప్తంగా పలువురు సర్ నోటీసులు అందుకుంటున్నారు. ఢిల్లీలో ఆదివారం కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్‌కు కూడా నోటీసు వచ్చాయి. 2002 ఢిల్లీ ఓటరు జాబితాలో జై శంకర్, ఆయన భార్య పేరు లేవు.

## ట్రాన్స్‌జెండర్లకు, కాంగ్రెస్ వాళ్లు చేసే దానికి

# తేడా లేదు




తెలంగాణ ప్రజలు కాంగ్రెస్, బీజేపీ లకు చెరో 8 ఎంపీ స్థానాలు ఇచ్చారు. కాంగ్రెస్ ఎంపీలు ప్రైవేటు వ్యక్తుల ఆస్తులపై దాడులు చేస్తున్నారు. ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ హరీష్ రావు ప్రైవేటు ప్రాపర్టీపై దాడి చేయడానికి వెళ్లారు. కాంగ్రెస్ వాళ్లు చెప్పి మరీ వెళ్తుంటే డీజీపీ ఏం చేస్తున్నారు. ఎంపీలు చేయాల్సిన పని ఇదేనా...? అని బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు.తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అరికెపూడి గాంధీ అనే ఎమ్మెల్యే పోలీసుల సహాయంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని చంపడానికి వెళ్లారు. పోలీసు బందో బస్తుతో హరీశ్ రావు పొలాలకు కాంగ్రెస్ వాళ్లను పంపించారు. సీఎం ప్రైవేటు ఆస్తుల వద్దకు వెళ్తే ఊరుకుంటారా..? ప్రజలు మిమ్మల్ని అధికార పీఠం మీద కూర్చోబెట్టింది ఇందు కేనా..? తెలంగాణలో భూ దందా నడుస్తోంది . తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి భూ దందాలకు పాల్పడు తున్నారన్నారు.నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి పార్లమెంట్ నియోజకవర్గం గద్వాలలో కులాంతర వివాహం చేసుకున్నందుకు దళిత కుటుంబంపై దాడి జరిగింది. ట్రాన్స్ జెండర్లకు, కాంగ్రెస్ వాళ్లు చేసే దానికి తేడా లేదు. ట్రాన్స్ జెండర్లు కనీసం పోలీసులు చెప్పింది పాటిస్తున్నారు. ఎంపీలకు కేంద్ర ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పిస్తోంది.



## మరో చక్కటి నగరాన్ని నిర్మించే అవకాశం దేవుడు నాకు ఇచ్చాడు

# బెంగళూరులో చంద్రబాబు

బెంగళూరులో 'ది ఎర్త్ సెంటర్' ప్రారంభోత్సవం

కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌తో కలిసి పాల్గొన్న సీఎం చంద్రబాబు

గ్రే గ్రోత్ నుంచి గ్రీన్ గ్రోత్ వైపు వెళ్లాలని పిలుపు

అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ రెండూ ముఖ్యమేనన్న సీఎం

పర్యావరణ హిత నగరంగా అమరావతి నిర్మాణం చేపడతామని వెల్లడి

బెంగళూరులోని వైట్ ఫీల్డ్ లో ఆదివారం జరిగిన 'ది ఎర్త్ సెంటర్ – విష్టా స్పేసెస్' ప్రారంభోత్సవంలో ఏపీ సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో కలిసి చంద్రబాబు ఈ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా సైబరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేశాను. ఇప్పుడు అమరావతి రూపంలో మరో చక్కటి నగరాన్ని నిర్మించే అవకాశం నాకు దేవుడు ఇచ్చాడు" అని అన్నారు. ప్రకృతి, సాంకేతికత, ఆధునిక మౌలిక వసతులతో అమరావతిని భవిష్యత్ తరాలకు అనువైన, పర్యావరణ హిత నగరంగా తీర్చిదిద్దుతున్నామని ఆయన స్పష్టం చేశారు.

## ఉత్తరప్రదేశ్‌లో 151 అంబేద్కర్ విగ్రహాలు

# ధ్వంసమయ్యాయి

: అఖిలేష్ యాదవ్



ఉత్తరప్రదేశ్‌లోని బీజేపీ పాలనలో 151 అంబేద్కర్ విగ్రహాలు ధ్వంసమయ్యాయని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేష్ యాదవ్ ఆరోపించారు. అయితే కేవలం 14 కేసుల్లో మాత్రమే అరెస్టులు జరిగాయని తెలిపారు. రాజ్యాంగాన్ని మార్చాలనే బీజేపీ ప్రయత్నంలో భాగంగానే ఉద్దేశపూర్వకంగా ఈ విధ్వంసకాండ జరిగిందని ఆయన విమర్శించారు. (గూనెప్ట్రఅశ్రీవంష్ట్ర ఘఝుఙ) ఆదివారం లక్నోలోని పార్టీ కార్యాలయంలో అఖిలేష్ యాదవ్ మాట్లాడారు. ఉత్తరప్రదేశ్‌లోని 72 జిల్లాల్లో బాబాసాహెబ్ భీమ్‌రావ్ అంబేద్కర్ విగ్రహాలు 151 వరకు ధ్వంసమైనట్లు తెలిపారు. తమ పార్టీ గుర్తించిన సంఘటనలు, పోలీస్ కేసులు, ప్రభుత్వ సమాచారం ఆధారంగా ఈ లెక్క తేల్చినట్లు చెప్పారు. 'బాబాసాహెబ్ భీమ్‌రావ్ అంబేద్కర్ విగ్రహాలే అత్యధికంగా ధ్వంసమయ్యాయి. బీజేపీ ప్రభుత్వ హయాంలో 72 జిల్లాల్లో 151కు పైగా అంబేద్కర్ విగ్రహాలు ధ్వంసం చేయడం లేదా పాడుచేయడం జరిగాయి' అని ఆయన అన్నారు.కాగా, బీజేపీ అధికారంలో ఉన్న ఉత్తరప్రదేశ్‌లో అంబేద్కర్ విగ్రహాల ధ్వంసానికి సంబంధించిన విధ్వంసకాండ ఉద్దేశపూర్వకంగా జరిగిందని అఖిలేష్ యాదవ్ ఆరోపించారు. రాజ్యాంగాన్ని మార్చాలనే బీజేపీ ప్రయత్నంతో దీనిని ముడిపెట్టారు. 'రాజ్యాంగాన్ని మార్చాలని వారు (బీజేపీ) భావించినప్పటికీ అందులో విఫలమయ్యారు. అందుకే ఈ చర్య ఉద్దేశపూర్వకంగా జరిగింది. బీజేపీ, ఆ భావజాలం కలిగిన వారు దాడి చేసినప్పుడు, వారు మొదటగా లక్ష్యంగా చేసుకునేది చేతిలో ఉండే రాజ్యాంగ ప్రతిని' అని విమర్శించారు.

## ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనానికి

# ముహూర్తం ఖరారు

- ఈ ఏడాది 12 రోజుల పాటు కొనసాగనున్న ఉత్సవాలు
- సెప్టెంబర్ 25న హుస్సేన్ సాగర్‌లో విగ్రహ నిమజ్జనం
- శ్రీ పంచముఖ సంకటహర మహా గణపతిగా దర్శనమిస్తున్న వినాయకుడు
- అనంత చతుర్దశి రోజున నిమజ్జన కార్యక్రమం

హైదరాబాద్‌లోని ప్రసిద్ధ ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం తేదీ ఖరారైంది. ఈ ఏడాది సెప్టెంబర్ 25న, శుక్రవారం రోజున గణనాథుడిని హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం చేయనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రకటించింది. అనంత చతుర్దశి పర్వదినం సెప్టెంబర్ 25న రావడంతో, అదే రోజు నిమజ్జన కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించారు.



# వినాయక నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న!

## -మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ-ఎస్సై చంద్రకుమార్

**సుల్తానాబాద్, సెప్టెంబర్-20:**

సుల్తానాబాద్ మున్సిపల్ పట్టణంలోని పూసాల రోడ్డులో మనం అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో సుల్తానాబాద్ ఎస్ఐ చంద్రకుమార్, మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, పదిహేనవ వార్డు కౌన్సిలర్ గాదాసు మంజుల రవీందర్, ఐదవ వార్డు కౌన్సిలర్ గరిగే శోభ శ్రీనివాస్, పాల్గొని, ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాలను ఉత్సవ కమిటీ సభ్యులు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. నిమజ్జనం సందర్భంగా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు, అధికారుల సూచనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు కొయ్యడ రమేష్, గరిగే శ్రీనివాస్, పూసాల ఆంజనేయులు, ఉట్కూరి లక్ష్మిరాజం, కొయ్యడ శంకరయ్య, కూరపాటి సంపత్, ఆవుల శివకృష్ణ, దికొండ మహేష్, కూరపాటి రవి, నిట్టూరి అర్జున్, వల్స శ్రీనివాస్‌తో పాటు కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..



# గణనాథుడి సేవలో రాష్ట్ర పద్మశాలి సంఘం నేత సత్యనారాయణ

**హుజురాబాద్ సెప్టెంబర్ 20:**

పెద్ద పాపయ్యపల్లి పద్మశాలి సేవా సంఘం ఆవరణలో కొలువుదీరిన వినాయకుడిని రాష్ట్ర పద్మశాలి సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ సంగెం సత్యనారాయణ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లుగా ఇక్కడ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నామని, స్వామివారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సుంకెనపల్లి శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడు డాక్టర్ సంగెం ఐలయ్య, ఉపాధ్యక్షుడు తలకొక్కుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రమేష్, విగ్రహ దాత జడల మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# తులేకలాన్‌లో ఘనంగా స్వచ్ఛతహి సేవా కార్యక్రమం

## మాల సంఘం నూతన కమిటీ ఏర్పాటు.. సామాజిక సేవకు పెద్దపీట

**ఇబ్రహీంపట్నం , 20 సెప్టెంబర్ :**

రంగారెడ్డి జిల్లా, తులేకలాన్ గ్రామపంచాయతీ పరిధిలో స్వచ్ఛతహి సేవా కార్యక్రమంను ఉత్సాహంగా నిర్వహించారు. గ్రామంలో పరిశుభ్రత, పారిశుధ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన ఆవశ్యకతను కార్యక్రమంలో వివరించారు. స్వచ్ఛమైన పరిసరాలు ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తులేకలాన్ గ్రామ మాల సంఘం నూతన కమిటీని ఏర్పాటు చేశారు. సంఘం ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రజల సమస్యలను తెలుసుకుని, సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ సంఘం అభివృద్ధికి కృషి చేయాలని నూతన కమిటీ సభ్యులు నిర్ణయించారు. నూతన కమిటీ వివరాలుఅధ్యక్షులు: హనుమండ్ల ఆంజనేయులుఉపాధ్యక్షులు: కొరిమి అంజయ్య, బండి గణేష్ప్రధాన కార్యదర్శి: వలవోజు గణేష్కార్యదర్శి: పంబలి ప్రభుకోశాధికారి: పంబలి నగేష్సలహాదారులు:మక్కపల్లి అంజయ్య, నాగటి అంజయ్య, కొరిమి కిషన్, దార నరసింహ, నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను పలువురు అభినందించారు. సంఘం ఐకమత్యంతో ముందుకు సాగుతూ గ్రామ అభివృద్ధి, పారిశుధ్యం, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. స్వచ్ఛతహి సేవా కార్యక్రమం ద్వారా గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



# గణేశుడికి మహా నైవేద్యం

## ---171 రకాల నైవేద్యాలు సమర్పించిన భక్తులు

**సుల్తానాబాద్, సెప్టెంబర్ 20:**

ఆది దేవుడైన గణేశుడికి భక్తులు భక్తిశ్రద్ధలతో మహా నైవేద్యం సమర్పించారు. సుల్తానాబాద్ పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆర్యవైశ్య భవన్‌లో ఏర్పాటు చేసిన గణేశుడి మండపం వద్ద నూట డెబ్బై ఒకటి రకాల నైవేద్యాలను స్వామివారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేకంగా తయారు చేసిన వివిధ రకాల ప్రసాదాలను తీసుకువచ్చి గణనాథుడికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం అర్చకులు పారువెల్ల అభిషేక్ శర్మ దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొమురవెల్లి భాస్కర్ లక్ష్మి, కొమురవెల్లి అక్షిత హరీష్ దంపతులు పూజ లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. మహా నైవేద్యం కార్యక్రమానికి మహిళలు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు..

మొదటి పేజీ తరువాయి

## ఎల్ నినో కంటే రేవంత్ రెడ్డే

# ప్రమాదకరం

యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరులో పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హరీశ్ రావు మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న సర్వేలన్నీ కేసీఆర్‌కు అనుకూలంగా ఉన్నాయని, అందుకే కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరికలు పెరిగాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని చెప్పుకుంటూనే రాక్షస పాలన సాగిస్తోందని విమర్శించారు. "అవకాశం ఉన్నప్పటికీ విద్యుదుత్పత్తి చేయకుండా బొగ్గు కొరత అనే సాకుతో కరెంట్ కోతలు విధిస్తున్నారు. కేసీఆర్ గారి హయాంలో 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తే.. ఇప్పుడు కేవలం 6-7 గంటల నాణ్యత లేని విద్యుత్ మాత్రమే వస్తోంది. దీంతో పంటలు ఎండిపోతున్నాయి. కృష్ణా నదిలో నీళ్లున్నా కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ వంటి లిఫ్టులను ఆన్ చేయడం లేదు," అని హరీశ్ రావు మండిపడ్డారు. మూడు పంటల నుంచి రైతుబంధు నిధులు విడుదల చేయలేదని, కరోనా కష్టకాలంలో కూడా కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు ఆపలేదని గుర్తుచేశారు. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిపై ప్రమాణం చేసి కూడా సీఎం రేవంత్ రెడ్డి దేవుణ్ని మోసం చేశారని ఆరోపించారు. బాండ్ పేపర్లపై ఇచ్చిన 420 హామీలు, గొర్రెల పంపిణీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాల ఊసే లేదని విమర్శించారు. తనను ప్రశ్నించినందుకు పిట్ట బెదిరింపులకు పాల్పడితే భయపడేది లేదని, ఆయన సంగతి చూస్తామని హెచ్చరించారు. "కేసీఆర్‌పై బురద చల్లితే రైతులకు న్యాయం జరగదు. పాలించడం చేతకాకపోతే నుదుటిపై 'నామమ్' రాసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలి" అని హరీశ్ రావు హితవు పలికారు.

మొదటి పేజీ తరువాయి

## ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనానికి

# ముహూర్తం ఖరారు

ఈ సంవత్సరం ఖైరతాబాద్ వినాయకుడు "శ్రీ పంచముఖ సంకటహర మహా గణపతి"గా భక్తులకు దర్శనమిస్తుండడం తెలిసిందే. ప్రతి ఏటా 11 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలు, ఈసారి ఒక రోజు అదనంగా 12 రోజుల పాటు కొనసాగనుండటం విశేషం. దీంతో భక్తులకు స్వామి వారిని దర్శించుకునేందుకు అదనపు సమయం లభించనుంది. ప్రతి సంవత్సరం మాదిరిగానే, ఈసారి కూడా భారీ ఏర్పాట్ల మధ్య మహాగణపతిని హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నిమజ్జనం తేదీ ఖరారు కావడంతో, భక్తులు మరియు నగర వాసులలో ఉత్సాహం నెలకొంది.

మొదటిపేజీ తరువాయి

## మరో చక్కటి నగరాన్ని నిర్మించే అవకాశం దేవుడు నాకు ఇచ్చాడు

# బెంగళూరులో చంద్రబాబు

### గ్రే గ్రోత్ నుంచి గ్రీన్ గ్రోత్ వైపు పయనం

ప్రపంచం ఇప్పుడు 'గ్రే గ్రోత్' నుంచి 'గ్రీన్ గ్రోత్' వైపు దృష్టి సారించాల్సిన తరుణం ఆసన్నమైందని చంద్రబాబు పిలుపునిచ్చారు. "కాంక్రీట్ జంగిల్స్ నుంచి పర్యావరణ హిత నిర్మాణాల గురించి అందరూ ఆలోచించాలి. అభివృద్ధి ఆగకూడదు, అదే సమయంలో పర్యావరణానికి గాయం చేయకూడదు. ఈ రెండింటినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలి" అని ఆయన సూచించారు. దశాబ్దాలుగా నగరాల విస్తరణ 'గ్రే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్' ఆధారంగా జరిగిందని, ఇప్పుడు గ్రీన్ గ్రోత్, సర్క్యులర్ గ్రోత్, రీజెనరేటివ్ గ్రోత్ వంటి విధానాలు అత్యవసరమని పేర్కొన్నారు. వనరులను అధికంగా వాడే భవనాలు కాకుండా, తెలివిగా వినియోగించుకునే నిర్మాణాలను చేపట్టాలని ఉద్బోధించారు. ప్రస్తుతం ఎదుర్కొంటున్న పర్యావరణ సమస్యలను దృష్టిలో ఉంచుకునే 'ది ఎర్త్ సెంటర్' నిర్మాణం జరిగిందని, ఇలాంటి భవనాలకే భవిష్యత్తు ఉంటుందని చంద్రబాబు ప్రశంసించారు. ప్రకృతి, సాంకేతికత, ఆధునిక పని వాతావరణాన్ని సమన్వయం చేస్తూ, రీ-సైకిల్ చేసిన టెర్రకోట వంటి పదార్థాలతో ఈ భవనాన్ని నిర్మించడం అభినందనీయమని అన్నారు.

### పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

వాతావరణ మార్పులనేవి భవిష్యత్తులో ఎదురయ్యే సమస్య కాదని, ఇప్పటికే మన ముందున్న పెను సవాలని చంద్రబాబు హెచ్చరించారు. పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరించాలని కోరారు. భవన నిర్మాణాల్లో 'నెట్ జీరో' విధానాన్ని పాటించాలని, సోలార్ విద్యుత్ వినియోగానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. "ప్రతి ఇంటి పైకప్పు ఒక పవర్ ప్లాంట్‌గా మారవచ్చు. ప్రతి నీటి చుక్కను తిరిగి వినియోగించవచ్చు. ప్రతి వ్యర్థాన్ని ఒక వనరుగా మార్చవచ్చు. నీటిని, నేలను కాపాడటమంటే సంపదను సృష్టించడమే" అని ఆయన వివరించారు. చెత్తను కంపోస్టుగా మార్చుకోవడం, రీ-యూజ్ విధానాన్ని అవలంబించడం ద్వారానే స్వచ్ఛ భారత్, స్వచ్ఛ కర్ణాటక, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధ్యమవుతుందని అన్నారు.

### అమరావతి - ఒక పర్యావరణ హిత నగరం

వ్యవసాయంలో జీరో బడ్జెట్ నేచరల్ ఫార్మింగ్ గురించి మాట్లాడుతున్నామని, పట్టణాభివృద్ధిలోనూ అదే స్ఫూర్తి అవసరమని చంద్రబాబు అన్నారు. 2030 నాటికి 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి సాధించాలనే జాతీయ లక్ష్యంలో ఆంధ్రప్రదేశ్ కీలక భాగస్వామిగా ఉంటుందని తెలిపారు. ఏపీలో సుమారు 165 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని ప్రణాళిక చేస్తున్నామని వెల్లడించారు. ఈ స్ఫూర్తితోనే అమరావతిని పూర్తి పర్యావరణ హిత నగరంగా తీర్చిదిద్దుతున్నామని పునరుద్ఘాటించారు. ప్రజల అవసరాలను గుర్తిస్తూ, ప్రకృతిని పరిరక్షిస్తూ ఈ అద్భుత ప్రాజెక్టును రూపొందించిన విస్టా స్పేసెస్ బృందాన్ని, వెంకటరమణన్ అసోసియేట్స్ ప్రతినిధులను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

మొదటి పేజీ తరువాయి

# ఉత్తరప్రదేశ్‌లో 151 అంబేద్కర్ విగ్రహాలు ధ్వంసమయ్యాయి: అఖిలేష్ యాదవ్

మరోవైపు ఉత్తరప్రదేశ్‌లో అంబేద్కర్ విగ్రహాల ధ్వంసానికి సంబంధించిన కేసుల వివరాలను సమాజ్‌వాదీ పార్టీ స్వయంగా సేకరించిందని అఖిలేష్ యాదవ్ తెలిపారు. 'మొత్తంగా మేం 151 కేసులను నమోదు చేయగలిగాం. సగటున లెక్కించి చూస్తే, బీజేపీ ప్రభుత్వ హయాంలో ఏటా 15కు పైగా అంబేద్కర్ విగ్రహాలు ధ్వంసమయ్యాయి. నమోదు కాని లేదా లెక్కలోకి రాని కేసులు కూడా ఉండవచ్చు' అని అన్నారు. అయితే ప్రభుత్వ గణాంకాలను ఉటంకిస్తూ కేవలం 14 కేసుల్లోనే అరెస్టులు జరిగాయని అఖిలేష్ యాదవ్ తెలిపారు. 45 కేసుల్లో గుర్తుతెలియని వ్యక్తులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు కాగా, ఎనిమిది కేసుల్లో నిర్దిష్ట వ్యక్తుల పేర్లతో ఎఫ్ఐఆర్‌లు దాఖలైనట్లు చెప్పారు. 84 కేసుల్లో ఎటువంటి చర్యలూ తీసుకోలేదని అన్నారు. బీజేపీ ప్రభుత్వం అంబేద్కర్‌ను గానీ, ఆయన విగ్రహాలను గానీ, లేదా ఆయన అనుచరులను గానీ గౌరవించలేదని అఖిలేష్ యాదవ్ ఆరోపించారు. ఆ తర్వాత జిల్లాల వారీగా అంబేద్కర్ విగ్రహాలు ధ్వంసమైన గణాంకాలను ఆ పార్టీ ఎక్స్‌లో పోస్ట్ చేసింది.

మొదటి పేజీ తరువాయి

# నేను వాళ్లూ, వీళ్లూ వదిలిన బాణాన్ని కాదు: కవిత

సభకు ముందు కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీగా వేదిక వద్దకు చేరుకున్న కవిత, తన రాజకీయ వైఖరిని వివరిస్తూ ప్రత్యర్థులపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "నన్ను కాంగ్రెస్ వదిలిన బాణమని బీఆర్ఎస్ వాళ్లు, కేసీఆర్ వదిలిన బాణమని రేవంత్‌రెడ్డి అంటున్నారు. మరికొందరు తలకాయ లేనివాళ్లు బీజేపీ బాణమని మాట్లాడుతున్నారు. కొడంగల్ గడ్డపై నుంచి నేను ఒక్కటే చెబుతున్నా. నేను తెలంగాణ బహుజనుల బాణాన్ని. యువజనుల యుద్ధ నినాదాన్ని. అంబేద్కర్ వాదాన్ని, మహాత్మ జ్యోతిబా ఫులే ఆత్మగౌరవ నినాదాన్ని నేను" అని కవిత ఉద్ఘాటించారు. ఒక మహిళ ఎవరి మద్దతు లేకుండా రాజకీయంగా నిలబడగలదని నిరూపించేందుకే ఇక్కడికి వచ్చానని, ప్రజలు తనకు ధైర్యం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కవిత విమర్శలు చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని గట్టు, కేటీ దొడ్డి మండలాల్లో అక్షరాస్యత రేటు అఫ్ఘానిస్తాన్‌తో సమానంగా ఉందని, గతంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన రేవంత్ రెడ్డి అప్పుడు ఏం చేశారని నిలదీశారు. దేశంలో మహిళలను మహారాణులుగా కీర్తిస్తారని, కానీ వంటింట్లోని గిన్నెల మీద కూడా మగవాళ్ల పేర్లే ఉంటాయని ఆవేదన వ్యక్తం చేశారు. 29 రాష్ట్రాలున్న దేశంలో కేవలం ఒక్క రాష్ట్రానికి మాత్రమే మహిళ ముఖ్యమంత్రిగా ఉన్నారని గుర్తుచేశారు. బహుజనులు, మహిళలు, యువత రాజకీయంగా ఎదిగేందుకు తన పోరాటం కొనసాగుతుందని కవిత తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

## దళితుల భూముల్లో అంగుళం కూడా తీసుకోం..

# ఆయన మాటలు నమ్మొద్దు

దళితులు, గిరిజనులు, బడుగు బలహీన వర్గాల ఆశీస్సులతోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని పొంగులేటి పేర్కొన్నారు. సామాజిక న్యాయం, పేదల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వాల ప్రధాన ప్రాధాన్యతలని అన్నారు. భూసంస్కరణలు, భూ పంపిణీ వంటి చారిత్రక నిర్ణయాలతో నిరుపేద దళితులకు భూములు ఇచ్చి హక్కులు కల్పించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని తెలిపారు. తెలంగాణ ప్రాంతంలో సుమారు 25 లక్షల ఎకరాల భూమిని దళితులకు, 2 లక్షల ఎకరాల పోడు భూములను గిరిజనులకు పంపిణీ చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని పేర్కొన్నారు. అధికారంలోకి వస్తే దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని చెప్పి మోసం చేసిన 'దొర' కేసీఆర్ మాటలను నమ్మవద్దని ఆయన ప్రజలను కోరారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌పై విచారణ జరుపుతామని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించిన నేపథ్యంలో ఈ వివాదం మొదలైంది. ఈ ఫామ్‌హౌస్ దాదాపు 700 ఎకరాల్లో విస్తరించి ఉందని, అందులో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని ముఖ్యమంత్రి ఆరోపించారు. ఈ క్రమంలోనే ఎర్రవల్లి గ్రామానికి చెందిన 120 మంది దళిత రైతులకు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. భూ యాజమాన్య హక్కులకు సంబంధించిన పత్రాలతో హాజరుకావాలని ఆ నోటీసుల్లో పేర్కొనడంతో దళితుల్లో ఆందోళన మొదలైంది. ఈ నేపథ్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. "ప్రభుత్వం మీ భూమిలో అంగుళం కూడా తీసుకోదు. మీ భూములను స్వాధీనం చేసుకునే ఉద్దేశం ఈ ప్రభుత్వానికి లేదు. మీ భూముల విషయంలో ఎలాంటి భయం, ఆందోళన అవసరం లేదు. ప్రజల ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది" అని దళితులకు భరోసా ఇచ్చారు. భూ రికార్డుల పరిశీలన, సర్వే, భూ సమస్యల పరిష్కారం వంటి ప్రక్రియలను భూములు లాక్కోవడంగా చూడటం సరికాదని ఆయన హితవు పలికారు. ప్రజల భూ హక్కులను స్పష్టంగా నమోదు చేయడం, వివాదాలను పరిష్కరించడం, వారి హక్కులకు రక్షణ కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. కొంతమంది శక్తిమంతమైన వ్యక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం దళితులను రెచ్చగొట్టేందుకు ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తూ భయాందోళనలు సృష్టిస్తున్నారని మంత్రి ఆరోపించారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఇలాంటి ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి చర్య చట్టబద్ధంగా, పారదర్శకంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

మొదటి పేజీ తరువాయి

# తెలంగాణకు భారీ వర్ష సూచన..

# మూడు రోజులు అప్రమత్తం

వివరాల్లోకి వెళితే, ఆది, సోమ, మంగళవారాల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు పడొచ్చని వాతావరణ శాఖ తెలిపింది. ఇదే సమయంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తూ, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆదివారం ఉదయం ఉత్తర అండమాన్ సముద్రం, దాని పరిసర ప్రాంతాల్లో కేంద్రీకృతమైన అల్పపీడనం, పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతోంది. ఇది సోమవారం (సెప్టెంబర్ 21) నాటికి తూర్పు మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా, మంగళవారం నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండంగా బలపడనుంది. బుధవారం ఉదయానికి ఈ వాయుగుండం ఉత్తర ఆంధ్రప్రదేశ్-దక్షిణ ఒడిశా తీరాలకు సమీపంలోకి చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో సెప్టెంబర్ 24న తెలంగాణలోని మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ ప్రత్యేకంగా హెచ్చరించింది. అలాగే ఆదిలాబాద్, కొమురం భీమ్ ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల సహా మరికొన్ని జిల్లాల్లో గంటకు 50-60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. ఇదిలా ఉండగా, దక్షిణ కోస్తాంధ్ర, దాని పరిసర పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని వాతావరణ కేంద్రం వివరించింది. గడిచిన 24 గంటల్లో నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో అత్యధికంగా 13.9 సెం.మీ., ములుగు జిల్లా ఏటూరునాగారంలో 10.4 సెం.మీ. వర్షపాతం నమోదైంది. తాజా హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

మొదటి పేజీ తరువాయి

# విదేశాంగ శాఖ మంత్రికి 'సర్' నోటీసు..!

దాంతో, ఓటరు జాబితాలో అవసరమైన మార్పుల కోసం సరైన ధ్రువ పత్రాలు సమర్పించాలని వీరికి ఎన్నికల సంఘం నోటీసులు ఇచ్చింది. ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, ఆయన కుటుంబ సభ్యులకు బీఎల్‌వోలు సర్ నోటీసు ఇచ్చారు. తాజాగా సర్ నోటీసు అందుకున్న వారిలో ఆర్మీ మాజీ అధికారి ఉపేంద్ర ద్వివేది, ఆయన భార్య.. సుప్రీం కోర్టు మాజీ న్యాయవాది రంజన దేశాయ్, ఆయన కుటుంబ సభ్యులు ఉన్నారు. 'విదేశాంగ మంత్రి సహా పలువురు అధికారులు, మాజీ న్యాయవాది, వారి కుటుంబ సభ్యుకు సిస్టమ్ ఆధారిత నోటీసులు అందించాం. ఈసీఐఎన్ఈటీలో వీరు తమ వివరాలను సరి చేసుకోవాలని కోరాం' అని ఢిల్లీ ఎన్నికల అధికారి వెల్లడించారు.

# మహిళల చేతుల్లో నైపుణ్యం.. స్వయం ఉపాధికి బాట

- ఏఎండిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా సాధికారతకు వినూత్న అడుగు
- *150 మందికి బ్యూటీషియన్ కోర్సు సర్టిఫికెట్లు.. 200 మందికి కుట్టు మిషన్లు*
- ఫౌండర్ ఆదిల్ సేవలకు అతిథుల అభినందనలు






**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 20 ( భద్రాద్రి న్యూస్ ) :** మహిళలకు నైపుణ్య శిక్షణ అందించి, వారిని స్వయం ఉపాధి దిశగా నడిపించాలనే లక్ష్యంతో ఏఎండిఆర్ ఫౌండేషన్ ఫర్ సోషల్ చేంజ్ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు పేర్కొన్నారు. మహిళా సాధికారత, స్కిల్ డెవలప్మెంట్, స్వయం ఉపాధిని ప్రోత్సహించే దిశగా ఫౌండేషన్ మరో ముందడుగు వేసింది. కొత్తగూడెం క్లబ్ వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో మూడు నెలల ఉచిత బ్యూటీషియన్ కోర్సు విజయవంతంగా పూర్తి చేసిన 150 మంది శిక్షణార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. అదే విధంగా టైలరింగ్‌లో శిక్షణ పొందిన 200 మంది మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. శిక్షణతో పాటు ఉపాధి సాధనకు అవసరమైన పరికరాలను అందించడం ద్వారా మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేందుకు ఫౌండేషన్ చేయూతనందించడం కార్యక్రమానికి ప్రత్యేకతగా నిలిచింది.

**శిక్షణతో పాటు ఉపాధికి చేయూత:**

కేవలం శిక్షణ ఇచ్చి వదిలేయకుండా, నైపుణ్యాన్ని ఆదాయ మార్గంగా మార్చుకునేందుకు అవసరమైన సహకారం అందించడం ద్వారా ఏఎండిఆర్ ఫౌండేషన్ సామాజిక బాధ్యతను చాటుకుంటోందని అతిథులు పేర్కొన్నారు. బ్యూటీషియన్ కోర్సు పూర్తి చేసిన మహిళలు ఇంటి వద్దే సేవలు అందించడంతో పాటు బ్యూటీ పార్లర్లలో ఉపాధి పొందేందుకు అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు. టైలరింగ్ శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మిషన్లు అందించడం వల్ల స్వయం ఉపాధికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని అన్నారు.

**ఆదిల్‌పై ప్రశంసల వర్షం :**

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, ప్రముఖులు ఏఎండిఆర్ ఫౌండేషన్ ఫౌండర్ ఆదిల్‌ను ప్రత్యేకంగా అభినందించారు. మహిళలకు ఉచితంగా శిక్షణ అందించడంతో పాటు వారికి స్వయం ఉపాధి సాధనాలను అందించడం అభినందనీయమన్నారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఇటువంటి కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. మహిళలకు నైపుణ్యం అందించడం అంటే ఒక కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే కాకుండా, సమాజంలో వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచడమని వారు పేర్కొన్నారు. ఏఎండిఆర్ ఫౌండేషన్ భవిష్యత్తులో మరిన్ని నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి యువత, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేయర్ మూడ్ గణేష్ చౌహన్, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత, కార్పొరేటర్లు సుగుణ, భవిత, డాక్టర్ స్వప్న, డాక్టర్ బిఎస్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ లాల్ సింగ్ నాయక్, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నాగ సీతారాములు, టీపీసీసీ సభ్యులు జెబి శౌరి,సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కోనేరు సత్యనారాయణ (చిన్ని), ఖమ్మం కాంగ్రెస్ యువ నాయకురాలు షహెల జావిద్, సర్పంచ్ అజ్మీరా లైలా, కొత్తగూడెం క్లబ్ సెక్రటరీ కోనేరు పూర్ణచందర్ రావు, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఫహీమ్ దాదా, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండి గౌస్ మొయినుద్దీన్, ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ అల్లాడి నర్సింహారావు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఫౌండేషన్ ప్రతినిధులు, శిక్షణార్థులు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# దంసలాపురం చెరువు వద్ద గణేష్ నిమజ్జనం కు ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- వినాయక విగ్రహాల తరలింపు సమయంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు
- వినాయక నిమజ్జనానికి పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలి
- దంసలాపురం చెరువు వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్, సిపి



**ఖమ్మం ప్రతినిధి , సెప్టెంబరు 20 (భద్రాద్రిన్యూస్):** గణేష్ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు. శనివారం ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని దంసలాపురం చెరువు వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పోలీస్ కమీషనర్ సునీల్ దత్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వినాయక నిమజ్జనం పురస్కరించుకొని కావాలసిన సౌకర్యాలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో గణేష్ ఉత్సవాలను ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఘనంగా నిర్వహించేందుకు అన్ని సౌకర్యాలతో ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు. నిమజ్జనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. చెరువులో నీటిమట్టం ఉన్నందున బారికేడింగ్, గజ ఈతగాళ్లు, క్రేన్లు, బోట్లు, రక్షణ పరికరాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, పోలీసులతో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, రాత్రి నిమజ్జనాలకు తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, ప్రవేశ--నిష్క్రమణ మార్గాలను ముందుగానే సిద్ధం చేసి, అత్యవసర వాహనాలకు ఇబ్బంది లేకుండా చూడాలని తెలిపారు. ఎత్తు కలిగిన గణేష్ విగ్రహాలకు ఇబ్బందులు లేకుండా నిమజ్జన ప్రాంతాలకు తరలించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందుకోసం ప్రత్యేక రూట్, ట్రాఫిక్, పోలీసు బందోబస్తు, రవాణా ఏర్పాట్లు ముందుగానే చేయాలని ఆదేశించారు. భక్తులకు తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని, నిమజ్జనం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, వైద్య, అగ్నిమాపక, నీటిపారుదల శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వినాయక విగ్రహాల తరలింపు సమయంలో విద్యుత్ షాక్ ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. షార్ట్ సర్క్యూట్‌కు అవకాశం లేకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణ



పాటించాలని, ఉత్సవ కమిటీ సభ్యులు పోలీస్ అధికారులకు పూర్తిస్థాయిలో సహకరించాలని కలెక్టర్ కోరారు. ప్రతి నిమజ్జన పాయింట్ వద్ద మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని, 108 వాహనం, పాము కాటు మందులు అందుబాటులో ఉంచాలని అన్నారు. నిమజ్జన పాయింట్ల వద్ద షిఫ్టుల్లో పారిశుధ్య సిబ్బందిని నియమించి నిరంతరం పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జన పాయింట్ల వద్ద క్రేన్లకు అదనపు డ్రైవర్లు, క్రేన్ మరమ్మతులు చేసే మెకానిక్‌లను అందుబాటులో ఉంచాలని అన్నారు. నిమజ్జనం రోజున ఉదయం 6 గంటలకే క్రేన్లు సిద్ధంగా ఉండేలా చూడాలని సూచించారు. విగ్రహాల తరలింపుకు అడ్డుగా వచ్చే చెట్టు కొమ్మలను ముందుగానే తొలగించాలని అన్నారు. నిమజ్జన పాయింట్ల వద్ద అవసరమైన మేరకు గజ ఈతగాళ్లను షిఫ్టుల వారీగా నియమించాలని, స్విమ్మర్లతో ముందుగానే చర్చించి వారికి విధుల షిఫ్ట్ వివరాలను తెలియజేయాలని అన్నారు. గణేష్ విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన రూట్ మ్యాప్‌ను ముందుగానే సిద్ధం చేయాలని, . అన్ని శాఖలు, ఉత్సవ కమిటీలు సమన్వయంతో పనిచేసి గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి మల్లేశం, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, ఖమ్మం అర్బన్ తహసీల్దారు జయచందర్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సర్దార్ పటేల్ స్టేడియంలో ఘనంగా ముగిసిన ఉమ్మడి ఖమ్మం జిల్లా టేబుల్ టెన్నిస్ పోటీలు

- *రాష్ట్ర స్థాయి పోటీలకు 21 మంది క్రీడాకారుల ఎంపిక*
- *అండర్--14, అండర్--17 విభాగాల్లో హోరాహోరీ పోటీలు..*
- *టీమ్ ఈవెంట్లలో శ్రీ చైతన్య గ్లోబల్ విస్టా, సర్వజ్ఞ రెజనెన్స్ జట్లు ఛాంపియన్లు*



**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 20 (భద్రాద్రి న్యూస్):-** జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి అండర్--14, అండర్--17 బాలబాలికల టేబుల్ టెన్నిస్ పోటీలు, ఎంపికలు ఆదివారం ఉత్సాహభరిత వాతావరణంలో ముగిశాయి. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి సుమారు 150 మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభను చాటారు. గురుకుల, ఆశ్రమ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆకట్టుకున్నారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి టి. సునీల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. టేబుల్ టెన్నిస్ విద్యార్థుల మానసిక, శారీరక వికాసానికి ఎంతో దోహదపడుతుందన్నారు. వేగవంతమైన నిర్ణయాధికారం, ఏకాగ్రత, కంటి--చేతి సమన్వయాన్ని పెంపొందించడంలో ఈ క్రీడ కీలకపాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి డాక్టర్ వై. రామారావు మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడమే ౹ా+ఖీ లక్ష్యమన్నారు. జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షులు బాలసాని విజయ్ కుమార్, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి గోవిందరెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు నిరంతర సాధనతో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. టీమ్ ఈవెంట్లలో ప్రతిభ టీమ్ ఈవెంట్లలో శ్రీ చైతన్య గ్లోబల్ విస్టా స్కూల్, సర్వజ్ఞ రెజనెన్స్ జూనియర్ కళాశాల జట్లు ఛాంపియన్లుగా నిలిచాయి. అంకం పాలెం, పెద్ద ముసలేరు ప్రభుత్వ పాఠశాలలు, డీఏవీ పాల్వంచ, విన్‌ఫీల్డ్ పాఠశాలలు విద్యార్థులు అద్భుత ఆటతీరుతో ఆకట్టుకున్నారు. ఏకులపల్లి, ఖమ్మం గురుకుల పాఠశాలల విద్యార్థులు కూడా విశేష ప్రతిభ కనబరిచారు. విజేతలకు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి టి. సునీల్ కుమార్ రెడ్డి, జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షులు బాలసాని విజయ్ కుమార్, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి డాక్టర్ వై. రామారావు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

అండర్--14 బాలుర విభాగం:
ఎస్.కె. ఫజల్, ఇ. హరి, ఎ. ఉజ్వల్, జాయ్, ఎ. యశ్వంత్, కె. హితేష్.

అండర్--14 బాలికల విభాగం:
ప్రవాస్య, పి. వంశిక, బి. తన్మయి శ్రీ, బి. హార్విక, బి. ఆరాధ్య, పి. తన్వి.

అండర్--17 బాలుర విభాగం:
పి. జ్వలిత్, జి. చార్విక్, ఇ. తరుణ్, కె. అఖిలేష్.

అండర్--17 బాలికల విభాగం: బి. సాయి శివాని, చొల్లేటి శరణ్య, చొల్లేటి పావని, ఎ. శివకుమారి, జి. తీర్థ. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, నిర్వాహక సభ్యులు పరిటాల చలపతి, షేక్ మదహర్, గద్దల రామారావు, ఆనేం రాజేష్, రెడ్డి సాయి శివ, కత్తుల నవ్య, పర్సా పవన్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు అసోసియేషన్ సభ్యులు, క్రీడాభిమానులు అభినందనలు తెలిపారు.

## డాక్టర్ జగదీష్ మృతికి టిడబ్ల్యుజేఎఫ్ అశ్రు నివాళి



**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 20 (భద్రాద్రి న్యూస్):** సూర్యాపేట వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఖమ్మంలోని మమత హాస్పిటల్ న్యూరో సర్జన్ డాక్టర్ కాసకుర్తి జగదీష్ సజీవ దహనమయ్యారన్న విషాద వార్తపై తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యుజేఎఫ్) ఖమ్మం జిల్లా అధ్యక్షులు సయ్యద్ ఖదీర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. డాక్టర్ జగదీష్ మృతికి అశ్రు నివాళులు అర్పిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.డాక్టర్ జగదీష్ మృతి వైద్య రంగానికి, ఖమ్మం ప్రజలకు తీరని లోటని సయ్యద్ ఖదీర్ పేర్కొన్నారు. ప్రజలకు వైద్య సేవలు అందించిన ఆయన ఆకస్మిక మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సంతాప కార్యక్రమంలో టిడబ్ల్యుజేఎఫ్, జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు దువ్వా సాగర్, రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యులు టి ఎస్ చక్రవర్తి, రాష్ట్ర కమిటీ సభ్యులు మారెం నాగేందర్ రెడ్డి, అక్రెడిటేషన్ కమిటీ సభ్యురాలు, యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు మధుశ్రీ తదితరులు పాల్గొని డాక్టర్ జగదీష్ మృతికి పట్ల సంతాపం ప్రకటించారు..

## కానుగుల అప్పమ్మ దశ దిన కర్మ కార్యక్రమం లో పాల్గొన్న మల్లిబాబు యాదవ్, ధనియాకుల హనుమంతరావు



**ఖమ్మం ప్రతినిధి ,సెప్టెంబర్ 20 ( భద్రాద్రిన్యూస్ ):** ఇటీవల అనారోగ్యంతో మరణించిన కానుగుల అప్పమ్మ దశదిన కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ పిఎసిఎస్ అధ్యక్షులు ధనియాకుల హనుమంతరావు లు పాల్గొని అప్పమ్మ చిత్రపటానికిపూల మాల వేసి నివాళులర్పించారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. వారి కుమారుడు కానుగుల రాధాకృష్ణ ను,ఓదార్చి, నవ మాసాలు మోసి కనిపించిన తల్లి కనుమరుగైతే ఆ బాధ ఎంతో విషాదంగా ఉంటుందని విచారణ వ్యక్తం చేశారు. కుటుంబాన్ని,పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొమ్మినేని శ్రీనివాసరావు, శీలం పుల్లయ్య, బొడ్డు లక్ష్మీనారాయణ,ఉప్పుగండ్ల వీరభద్రరావు, అయితన బోయిన విఠల్ రావు, అయితన బోయిన సత్యం, పోతన బోయిన వెంకటేశ్వర్లు, దూగుంట్ల వీరన్న, కానుగుల కృష్ణ కుటుంబ సభ్యులు బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు

## డా. జగదీష్ మృతి వైద్యరంగానికి తీరని లోటు

– మాజీ ఎంపీ నామ



**ఖమ్మం ప్రతినిధి ,సెప్టెంబర్ 20( భద్రాద్రిన్యూస్):** ప్రముఖ న్యూరో సర్జన్ డా. కే. జగదీష్‌బాబు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పట్ల బీఆర్ఎస్ మాజీ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు విచారం వ్యక్తం చేశారు. ఎంతోమంది ప్రాణాలను కాపాడి, రోగులకు భరోసా కల్పించిన డా. జగదీష్ ఆకస్మిక మరణం వైద్యరంగానికి, సమాజానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ డా. జగదీష్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

## ఐలయ్య కు అక్షర కిరిటీ బిరుదు



**ఖమ్మం ప్రతినిధి,సెప్టెంబర్ 20 (భద్రాద్రిన్యూస్):** ఖమ్మం కు చెందిన విశ్రాంతి ఉపాధ్యాయుడు కవి రచయిత పంజాల ఐలయ్య కు అక్షర కిరిటీ బిరుదు లభించింది. 176 వ జాతీయ ద్వి శతాధిక కవి సమ్మేళనం శ్రీ శ్రీ కళావేదిక భద్రాద్రి కవితా పండుగ డా . పాల్ రాజ్ ఇంజనీర్ కాలేజీ లో ఆదివారం జరిగింది భద్రాచలం లో 200 మంది రచయితలు కవులు పాల్గొన్న సభ లో ముఖ్య అతిథిగా ఐటీడీఏ పీవో.బి.రాహుల్ , తాళ్లూరి పంచాక్షరయ్య, శ్రీ శ్రీ కళావేదిక జాతీయ అధ్యక్షరాలు ఈశ్వరి భూషణ్, పార్థసారథి వరలక్ష్మి, శ్రీనివాసాచార్యులు చేతులు మీదుగా అక్షర కిరీటి బిరుదు అందుకున్నారు. ఈ సందర్భంగా జ్ఞాపిక ప్రశంస పత్రంతో ఘనంగా సత్కరించారు ఐలయ్యకు అక్షర కిరీటి బిరుదు లభించడంతో ఖమ్మం సాహిత్యకారులు అభినందించారు

## శ్రీ శివ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శివ కళ్యాణం, అన్నదానం





**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 20( భద్రాద్రి న్యూస్):** ఖమ్మం నగరంలోని 49వ డివిజన్ మామిళ్ళగూడెంలో శ్రీ శివ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో శనివారం రాత్రి శివ కళ్యాణం జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అదేవిధంగా ఆదివారం ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు సుధీర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.

## లంబోదరునికి ప్రత్యేక పూజలు

– పూజల్లో పాల్గొన్న ఆర్ జె సి కృష్ణ, నామవరపు ఈశ్వర్



**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 20 (భద్రాద్రి న్యూస్):** స్థానిక జహీర్పుర ఎస్సీ కాలనీలోని రేషన్ షాపు వద్ద లంబోదర యూత్ అసోసియేషన్ గణేష్ ఉత్సవ సమితి ఏర్పాటు చేసిన గణేష్ మండపం లో ఎస్బిఐటి, ఆర్ జె సి విద్యాసంస్థల చైర్మన్ ఆర్ జె సి కృష్ణ లంబోదరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యువ నాయకులు నామవరపు ఈశ్వర్, నామవరపు సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక కుంకుమ పూజ కార్యక్రమానికి ఆర్ జె సి కృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. గణనాథుడికి ధూప దీప నైవేద్యాలతో, హారతులతో పూజలు చేశారు. అనంతరం సామూహిక కుంకుమ పూజ కార్యక్రమాన్ని నిర్వహించి మహిళా భక్తులకు బహుమతులు అందించారు. నామవరపు ఈశ్వర్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాల స్ఫూర్తితో యువత సమైక్యతతో ఉండి తమ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు నామవరపు సతీష్, పి నాగరాజు, పోటు శరత్, బత్తుల మురళి, కనకం వీరభద్రం, మాటేటి కిరణ్, రాఘవరపు ప్రసాద్, సత్యనారాయణ, వడ్లమూడి రవి, మానుకొండ చంద్రకాంత్, భరత్, సంపత్, గాదె రవి, ముతేష్, అనిల్ , ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కోదాడలో సాలార్జంగ్ పేట ఈద్గాలో ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు: వర్షాలు కురవాలని అల్లాకు దువా



**కోదాడ, సెప్టెంబర్ 20(భద్రాద్రి న్యూస్):**ఎల్ నినో ప్రభావం కారణంగా ఏర్పడిన తీవ్ర వర్షభావ పరిస్థితులను అధిగమించడానికి కోదాడ పట్టణంలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు (నమాజ్–ఎ–ఇస్తిస్కా) నిర్వహించారు. పట్టణంలోని సాలార్జంగ్ పేట ఈద్గా మైదానంలో ముస్లింల ఆధ్వర్యంలో ఈ ప్రార్థనలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి.దేశవ్యాప్తంగా సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, కరవు పరిస్థితులు తొలగిపోవాలని ఈ సందర్భంగా వారు అల్లాను వేడుకున్నారు. సకాలంలో వర్షాలు పడితేనే రైతులు, ప్రజల జీవితాల్లో ఆనందాలు వికసిస్తాయని, అలాగే మూగజీవాలు, పశుపక్షాదులకు కూడా తాగునీరు, గ్రాసం లభించి జీవించగలుగుతాయని వారు పేర్కొన్నారు. ప్రజలందరిపై ఎల్లప్పుడూ అల్లా దీవెనలు ఉండాలని, దేశం సుభిక్షంగా వర్ధిల్లాలని ముస్లిం సోదరులు ప్రగాఢంగా ఆకాంక్షిస్తూ ప్రత్యేక దువా చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణానికి చెందిన పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

## ప్రజా పాలనలో భాగంగా రామభక్తుల శ్రమదానం




**పినపాక, (భద్రాద్రి న్యూస్) సెప్టెంబర్ 20:** గ్రామంలోని వివిధ ప్రదేశాలలో ఉన్న చెత్తను తొలగించి పరిశుభ్రమైన, స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన" స్వచ్ఛతా హి సేవ" పథకంలో భాగంగా మండల కేంద్రంలోని రామాలయం నందు శ్రీరామ భక్తులతో కలిసి స్థానిక సర్పంచ్ అరిగెల అలివేలు పారిశుద్ధ సిబ్బంది సహకారంతో రామాలయ ప్రాంగణాన్ని , పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి ఆలయాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అరిగెల అలివేలు మాట్లాడుతూ గ్రామస్తులు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని, పారిశుధ్య కార్మికుల సేవలను గౌరవిస్తూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.స్వచ్ఛత ఒక్కరోజు కార్యక్రమంగా కాకుండా నిత్య జీవితంలో ఒక అలవాటుగా మారినప్పుడే పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన సమాజం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.రామాలయంలో ఉన్న నీటి బోరుకు ఉన్న మోటర్ మరమ్మతుకు గురవడంతో రామ భక్తులైన ఏలేటి అశోక్ 1000/–, తన్నీరు శ్రీనివాసరావు కిరాణం 1116/, సరిత అంగన్వాడి టీచర్ 1116,గబ్బెట ధనలక్ష్మి 1116/–, వెంకట రమణ 516/–, అరిగెల అలివేలు 1116/–, ఎలిపెద్ది భారతమ్మ 516/–, దొడ్డ వెంకటేశ్వర్లు 516/–, గొట్టిముక్కల స్వతంత్ర రెడ్డి 516/–, గోగిరెడ్డి సమ్మిరెడ్డి 516/– దాతల సహకారంతో సమీకరించి నీటి సమస్య పరిష్కారానికై తమ వంతు సహకారాన్ని అందించారు. భక్తితో పాటు సేవా భావాన్ని చాటిన రామ భక్తుల శ్రమదానం స్థానికులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో మహిళలు, గ్రామస్తులు, యువత, తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారిని ఆశీర్వదించిన సర్పంచ్ హీరాలాల్

**- గ్రీష్మ శ్రీ చెవులు కుట్టే వేడుకకు హాజరైన సర్పంచ్.. కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు**



**కారేపల్లి , సెప్టెంబర్ 20 (భద్రాద్రి న్యూస్ రాములు):** భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీ కార్యదర్శి పెండ్రా అనిల్ కుమార్ కుటుంబంలో శుభకార్యం ఘనంగా జరిగింది. ఆయన ప్రథమ కుమార్తె చి. గ్రీష్మ శ్రీ చెవులు కుట్టే కార్యక్రమం కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ వేడుకకు భాగ్యనగర్ తండా సర్పంచ్ బానోత్ హీరాలాల్ హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. చిన్నారి గ్రీష్మ శ్రీ ఆయురారోగ్యాలతో, ఆనందంగా ఎదిగి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సర్పంచ్ హీరాలాల్ ఆకాంక్షించారు. చిన్నారి కుటుంబ సభ్యులను పరామర్శించి శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచ్ హీరాలాల్ రాకతో కార్యక్రమంలో ఆత్మీయ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు వి. గాంధీ, పార్టీ జిల్లా నాయకులు గుగులోత్ భీముడు నాయక్, దారావత్ వినోద్ నాయక్, గుగులోత్ బాబు నాయక్, వాంకుడోత్ గిరిప్రసాద్ నాయక్, పంచాయతీ సిబ్బంది నంద హేంచంద్, రాందాస్, రమేష్, లకన్ తదితరులు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

## తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యులకు ఘన సన్మానం





**పాల్వంచ, సెప్టెంబర్ 20 (భద్రాద్రి న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యులు కొంకటి లక్ష్మీనారాయణ, నేనావత్ రాంబాబు నాయక్‌లకు ఘనంగా ఆత్మీయ సన్మానం ఆదివారం నిర్వహించారు. బక్కి వెంకటయ్య మరియు కమిషన్ సభ్యులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణానికి చెందిన ఎస్సీ ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ రాష్ట్ర నాయకుడు ప్రముఖ విద్యావేత్త బండి లక్ష్మణ్ గృహానికి విచ్చేసిన శుభ సందర్భంగా వారికి సాదర స్వాగతం పలికి, పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీ ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ రాష్ట్ర నాయకుడు ప్రముఖ విద్యావేత్త బండి లక్ష్మణ్ మాట్లాడుతూ తమ ఆహ్వానాన్ని మన్నించి ఇంటికి విచ్చేసి ఆశీర్వదించినందుకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు, సభ్యులకు ప్రత్యేక హృదయపూర్వక ధన్యవాదాలు మరియు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# బొక్కలతండా బిడ్డకు జాతీయ స్థాయి గౌరవం

**- 20 ఏళ్ల అధ్యాపక సేవలకు అరుదైన గుర్తింపు.. ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకున్న వాంకుడోత్ రాంబాబు**







**సింగరేణి, సెప్టెంబర్ 20 (భద్రాద్రి న్యూస్ రాములు):** ఖమ్మం జిల్లా సింగరేణి మండలం బొక్కలతండా గ్రామానికి చెందిన అధ్యాపకుడు వాంకుడోత్ రాంబాబుకు జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది. గత 20 ఏళ్లుగా అధ్యాపకుడిగా విద్యారంగానికి అందిస్తున్న సేవలను గుర్తించిన తమిళనాడు ఎక్సలెంట్ ఉపాధ్యాయ సంఘం, శ్రీ శంకర––శారద ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ స్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డును ఆయన అందుకున్నారు. తమిళనాడు రాష్ట్రంలోని తిరువారూర్ జిల్లా పేరాళం పట్టణంలోని శంకర మెట్రిక్ హయ్యర్ సెకండరీ పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పుదుచ్చేరి ఎమ్మెల్యే డాక్టర్ వి. విగ్నేశ్వరన్ చేతుల మీదుగా రాంబాబు ఈ ప్రతిష్టాత్మక అవార్డును స్వీకరించారు.

**గిరిజన గ్రామం నుంచి జాతీయ వేదిక వరకు..**

మారుమూల గిరిజన గ్రామమైన బొక్కలతండా నుంచి విద్యారంగంలో తన ప్రస్థానాన్ని ప్రారంభించిన వాంకుడోత్ రాంబాబు, రెండు దశాబ్దాలుగా అధ్యాపక వృత్తికి అంకితభావంతో సేవలందిస్తున్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తూ, తన సేవలతో ప్రత్యేక గుర్తింపు పొందిన ఆయనకు జాతీయ స్థాయిలో ఉత్తమ అధ్యాపక అవార్డు లభించడం బొక్కలతండాతో పాటు సింగరేణి మండలానికి గర్వకారణంగా నిలిచింది. మారుమూల ప్రాంతానికి చెందిన గిరిజన బిడ్డగా విద్యారంగంలో కృషి చేస్తూ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన రాంబాబు ప్రస్థానం యువతకు, విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పలువురు అభినందించారు. అవార్డు అందుకున్న రాంబాబుకు బొక్కలతండా గ్రామస్తులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా డాక్టర్ మహేశ్వరీ నారాయణన్, గౌరవ అతిథులుగా తమిళనాడు రాష్ట్ర మాత్స్య శాఖ కార్యదర్శి వి.ఆర్. ఇళయరాజా, నాగపట్నం జిల్లా కార్యదర్శి ఎన్.ఆర్. అరుల్ కుమార్, మదర్ గ్లోరీ వ్యవస్థాపకులు ఎమ్. అంటోయిన్, ఈజీపీఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ ఎండీ కరీకులన్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# కరువు కోరల్లో తెలంగాణ.. రైతన్నకు కష్టకాలం

**- వర్షాభావంతో పంటలు ఎండిపోతున్నాయి.. తెలంగాణను కరువు ప్రభావిత రాష్ట్రంగా ప్రకటించాలి: ఏఐకేఎంఎస్**



**కారేపల్లి, సెప్టెంబర్ 20 (భద్రాద్రి న్యూస్ రాములు):** తెలంగాణ రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు తీవ్రరూపం దాల్చుతున్నాయని, కరువు ఛాయలు కమ్ముకుంటున్నా ప్రభుత్వం తగిన స్థాయిలో స్పందించడం లేదని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ ఉక్లా, జిల్లా నాయకుడు భూక్య శివ నాయక్ అన్నారు. రాష్ట్రాన్ని కరువు ప్రభావిత ప్రాంతంగా గుర్తించి రైతులు, వ్యవసాయ కూలీలను ఆదుకునేందుకు తక్షణమే ప్రత్యేక సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కారేపల్లి మండలంలోని ఉమ్మడి గుంపెల్లగూడెం పంచాయతీ పాత చెన్నాయిగలగడ్డ పరిధిలో రైతులతో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, పంటల సాగుపై వాటి ప్రభావాన్ని రైతులను అడిగి తెలుసుకున్నారు.

**వర్షాల లోటుతో సాగుకు దెబ్బ**

జూన్ నుంచి ఇప్పటివరకు సాధారణ స్థాయిలో కురవాల్సిన వర్షపాతంతో పోలిస్తే 22.5 శాతం లోటు నమోదైందని నాయకులు తెలిపారు. వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో భూగర్భ జలాలు తగ్గిపోయి బావులు, బోర్లలో నీటి మట్టాలు పడిపోతున్నాయని అన్నారు. దీంతో వర్షాధార పంటలపై ఆధారపడిన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో సాధారణ సాగు విస్తీర్ణం కోటి 32 లక్షల ఎకరాలకు పైగా ఉండగా, ఈ ఏడాది కోటి 22 లక్షల ఎకరాలకు పైగా మాత్రమే సాగు జరిగిందని తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే వరి సాగు గణనీయంగా తగ్గిందని, పత్తి, ఇతర మెట్ట పంటలు సైతం వర్షాభావ పరిస్థితులతో దెబ్బతింటున్నాయని అన్నారు. సెప్టెంబర్‌లోనూ ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో భూమిలో తేమ తగ్గి పంటల ఎదుగుదల మందగిస్తోందని తెలిపారు. ఇప్పటికే సాగు చేసిన పంటలు నీటి కొరతతో ఎండిపోతుండటంతో పెట్టుబడులు పెట్టిన చిన్న, సన్నకారు రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**రైతులను ఆదుకునేందుకు తక్షణ చర్యలు చేపట్టాలి**

వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్న రైతులు, వ్యవసాయ కూలీలను కరువు పరిస్థితుల నుంచి రక్షించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర కార్యాచరణ చేపట్టాలని ఏఐకేఎంఎస్ నాయకులు కోరారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే దశ నుంచి పంటను మార్కెట్‌లో విక్రయించే వరకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, పంట నష్టాన్ని అంచనా వేయాలని డిమాండ్ చేశారు. రైతులకు పంట నష్టపరిహారం అందించడంతో పాటు సాగునీరు, తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు అత్యవసర చర్యలు చేపట్టాలని కోరారు. తెలంగాణను కరువు ప్రభావిత రాష్ట్రంగా గుర్తించి కరువు సహాయక చర్యలను వెంటనే ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్, పార్టీ జిల్లా నాయకులు భూక్య శివ, వంగూరి వెంకన్న, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు సాంబ, చుంచు నాగమణి, కౌసల్య, వెంకటరమణ, నాగేశ్వరరావు, ఆర్.ఎం. కాంతమ్మ, పుల్లయ్య, శ్రీరాములు, కోటేష్, రవి, శాంతక్క తదితరులు పాల్గొన్నారు.

# వైరా మున్సిపాలిటీ పరిధిలో వివిధ వార్డులలో మహా అన్నదానం

**- అన్నం పరబ్రహ్మ స్వరూపం - కాపా**
**- యువత సామాజిక సేవలలో కూడా పాల్గొనాలి**
**- వైరా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ**



**వైరా, సెప్టెంబర్ 20, (భద్రాద్రి న్యూస్) :** వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని 4,6,9,17,20 వార్డులలో ద్వారకా నగర్ పెన్షన్ భవన్ పల్లిపాడు వినాయక మండపం లీలా సుందరయ్య నగర్ వద్ద ఉన్న గణపతి మండపం వద్ద గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైరా మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ, పాల్గొని అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు అన్ని దానాల కంటే అన్నదానం గొప్పదని అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పండగలు ప్రజల్లో ఐక్యత,సోదరా భావం పెంపొందిస్తాయని, పూర్వీకుల నుంచి వస్తున్న సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి తరం పై ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజలు సమిష్టిగా పండగలు నిర్వహిస్తూ మతసామరస్యాన్ని చాటడం అభినందనీయమని అన్నారు. యువత ఉత్సవాలకే పరిమితం కాకుండా, సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ అన్నదాన కార్యక్రమంలో జిల్లా డాక్టర్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల గంగారావు, 17వ వార్డు కౌన్సిలర్ బత్తుల సుమతి, గ్రంధి ప్రవీణ్ కుమార్, తోటకూర శ్రీకాంత్, వీరబాబు యాదవ్, ఏదునూరి శ్రీనివాసరావు, జాల మహాలక్ష్మి, సుగ్గల మాధవి, పువ్వాళ్ళ రాము, చెరుకూరి కిరణ్, చెరుకూరి శ్రీనివాసరావు అరుణ తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయుల అప్‌గ్రేడేషన్‌కు ఎమ్మెల్యే హామీ

**- భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల సమస్య పరిష్కారానికి కృషి**

**కారేపల్లి , సెప్టెంబర్ 20 (భద్రాద్రి న్యూస్ రాములు):** గిరిజన సంక్షేమ శాఖ (ఐటీడీఏ) పరిధిలో పనిచేస్తున్న భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల అప్‌గ్రేడేషన్ సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ హామీ ఇచ్చారు. అప్‌గ్రేడేషన్ సమస్యను పరిష్కరించి తమకు న్యాయం చేయాలని కోరుతూ ట్రైబల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర (ɹజూఋూ) వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంపీ నాయక్ మాలోత్ ప్రతాప్ సింగ్ ఆధ్వర్యంలో ప్రతినిధులు శనివారం ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల అప్‌గ్రేడేషన్ ప్రక్రియ పెండింగ్‌లో ఉండటంతో ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారని ప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అప్‌గ్రేడేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. ఇప్పటికే సెప్టెంబర్ 11న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అప్‌గ్రేడేషన్ ప్రక్రియపై వినతిపత్రం సమర్పించిన విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ అప్‌గ్రేడేషన్‌కు సంబంధించిన ఫైల్ స్థితిగతులను పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. అప్‌గ్రేడేషన్ కోసం ఎదురుచూస్తున్న ఉపాధ్యాయుల కుటుంబాల్లో సంతోషం నింపేలా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయుల సమస్యపై స్పందించి పరిష్కారానికి హామీ ఇచ్చిన ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌కు ɹజూఋూ నాయకులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.




# లావుడియా తండ  గణనాథుడి సన్నిధిలో మహా అన్నదానం

**– లావుద్యా తండాలో భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలు.. కుంకుమ పూజల్లో పాల్గొన్న ఆడపడుచులు**





**సింగరేణి, సెప్టెంబర్ 20 (భద్రాద్రి న్యూస్ రాములు):** సింగరేణి మండలం భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని లా వుద్యా తండాలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గణేష్ మండపం వద్ద ఆదివారం మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తి, సేవాభావం కలగలిసిన ఈ కార్యక్రమానికి గ్రామస్తులు, దాతలు, గ్రామ పెద్దలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భాగ్యనగర్ తండా సర్పంచ్ చేతుల మీదుగా మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. లవుద్యా తండాతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. గణనాథుడి నామస్మరణల మధ్య అన్నదానం నిర్వహించడంతో మండపం పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి.

**విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి సన్నిధిలో..**

విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడిని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. శుభకార్యాలకు ఆదిదేవుడిగా, జ్ఞానం--బుద్ధికి ప్రతీకగా గణపతిని కొలుస్తారు. గణేష్ నవరాత్రుల సందర్భంగా గణనాథుడిని సామూహికంగా ఆరాధిస్తూ భక్తులు తమ కుటుంబాల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి కోసం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా లవుద్యా తండా గణేష్ మండపం వద్ద కుంకుమ పూజ కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. తండాకు చెందిన ఆడపడుచులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. గణపతి ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, గ్రామంలో సుఖశాంతులు నెలకొనాలని ఆకాంక్షించారు.

**సేవాభావానికి ప్రతీకగా అన్నదానం**

గణేష్ ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన మహా అన్నదానం భక్తుల్లో సేవాభావాన్ని చాటింది. భక్తులకు ఆహారం అందించడం ద్వారా గణనాథుడి సేవలో భాగస్వాములయ్యామని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలు భక్తి కార్యక్రమాలకే పరిమితం కాకుండా గ్రామస్తుల మధ్య ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించేలా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వినాయక కమిటీ సభ్యులు లవుద్యా యువరాజ్, సాయి, కమల్, జీవన్ ఠాగూర్, శివసాయి, గ్రామ పెద్దలు, దాతలు, మహిళలు, యువత, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.



# గణనాథుడి సన్నిధిలో మహా అన్నదానం

**– గుడి తండాలో భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలు.. కుంకుమ పూజల్లో పాల్గొన్న ఆడపడుచులు**

**సింగరేణి, సెప్టెంబర్ 20 (భద్రాద్రి న్యూస్ రాములు):** సింగరేణి మండలం భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని గుడి తండాలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గణేష్ మండపం వద్ద మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తి, సేవాభావం కలగలిసిన ఈ కార్యక్రమానికి గ్రామస్తులు, దాతలు, గ్రామ పెద్దలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. గుడి తండాతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. గణనాథుడి నామస్మరణల మధ్య అన్నదానం నిర్వహించడంతో మండపం పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి.

**విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి సన్నిధిలో..**

విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడిని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. శుభకార్యాలకు ఆదిదేవుడిగా, జ్ఞానం--బుద్ధికి ప్రతీకగా గణపతిని కొలుస్తారు. గణేష్ నవరాత్రుల సందర్భంగా గణనాథుడిని సామూహికంగా ఆరాధిస్తూ భక్తులు తమ కుటుంబాల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి కోసం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గుడి తండా గణేష్ మండపం వద్ద కుంకుమ పూజ కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. తండాకు చెందిన ఆడపడుచులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. గణపతి ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, గ్రామంలో సుఖశాంతులు నెలకొనాలని ఆకాంక్షించారు.



**సేవాభావానికి ప్రతీకగా అన్నదానం**

గణేష్ ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన మహా అన్నదానం భక్తుల్లో సేవాభావాన్ని చాటింది. భక్తులకు అన్నప్రసాదం అందించడం ద్వారా గణనాథుడి సేవలో భాగస్వాములయ్యామని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలు గ్రామస్తుల మధ్య ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించేలా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.





ఈ కార్యక్రమంలో వినాయక కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు, దాతలు, మహిళలు, యువత, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

# పీఆర్టీయూ తల్లాడ మండల నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**- అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఉంగరాల వెంకటేశ్వర్లు, అద్దంకి గోపాలకృష్ణ ఏకగ్రీవం**



**తల్లాడ, సెప్టెంబర్ 20 (భద్రాద్రిన్యూస్ ):-** పీఆర్టీయూ--టీఎస్ తల్లాడ మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తల్లాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పీఆర్టీయూ--టీఎస్ తల్లాడ మండల సర్వసభ్య సమావేశంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా ఉంగరాల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా అద్దంకి గోపాలకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కార్యవర్గ సభ్యులుగా గుజ్జు సరోజిని, కాటూరి భాస్కర్, కామిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పడాల సైదులు, కంభంపాటి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా తల్లాడ మండల విద్యాధికారి నెమ్మకంటి దామోదర ప్రసాద్, పీఆర్టీయూ--టీఎస్ ఖమ్మం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు విజయ్ అమృత్ కుమార్ హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను ఉపాధ్యాయులు అభినందించారు.

# దళితుల భూములకు సంపూర్ణ రక్షణ

**– అంగుళం భూమిని కూడా ప్రభుత్వం తీసుకోదు విషప్రచారాన్ని నమ్మొద్దు: మంత్రి పొంగులేటి**



**హైదరాబాద్, సెప్టెంబరు 20 (భద్రాద్రి న్యూస్):** "దళితులు, గిరిజనుల భూములను లాక్కోవడం ప్రజా ప్రభుత్వ విధానం కాదు. వారి అంగుళం భూమిని కూడా ప్రభుత్వం తీసుకోదు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం దళితుల భూములకు సంపూర్ణ రక్షణగా నిలుస్తుంది. ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. విషప్రచారాన్ని నమ్మొద్దు. రెచ్చగొట్టే ప్రయత్నాలను తిప్పికొట్టాలి" అని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పిలుపునిచ్చారు. భూములకు సంబంధించిన రికార్డుల పరిశీలన, సర్వేలు, భూ సమస్యల పరిష్కారం వంటి ప్రక్రియలను ప్రజల భూములను లాక్కోవడానికి చేస్తున్న చర్యలుగా చూడటం సరికాదని ఆదివారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. భూ సంస్కరణలు, భూ పంపిణీ వంటి కార్యక్రమాల ద్వారా భూమిలేని దళితులకు భూములు ఇచ్చి వాటిపై హక్కు కల్పించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వాలకు ఉందన్నారు. అధికారంలోకి వస్తే దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తామని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని విస్మరించారని విమర్శించారు. రీ–సర్వే ద్వారా భూముల వాస్తవ పరిస్థితులను గుర్తించి దళితులకు, గిరిజనులకు హక్కులు కల్పిస్తున్నామని చెప్పారు. సూర్యాపేట జిల్లా నూతనకల్, మద్దిరాల ప్రాంతంలోని 15 రెవెన్యూ గ్రామాల్లో, మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం గ్రామంలో దశాబ్దాల భూ సమస్యలకు పరిష్కారం చూపించామని ఆయన తెలిపారు.

# గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్‌లను దూరం చేసే వెల్లుల్లి..




**ఇంటర్నెట్ డెస్క్:** కొంత కాలంగా గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ లాంటివి మానవళికి శాపంగా మారాయి. చిన్నాపెద్దా తేడా లేకుండా యువకుల నుంచి వృద్ధుల వరకు అందరూ వీటి బారిన పడుతున్నారు. అయితే ఒక చిట్కాతో స్ట్రోక్ రాదని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇందుకోసం ఎలాంటి బ్రహ్మ పదార్థాలు అక్కర్లేదని, నిత్యం వంటింట్లో కనిపించే వెల్లుల్లితోనే గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని సూచిస్తున్నారు. మెదడులో ఏదైనా భాగానికి రక్త సరఫరా నిలిచిపోయినప్పుడు స్ట్రోక్ వస్తుంది. అలాగే మెదడులోని రక్తనాళం పగిలినప్పుడూ ఇది సంభవిస్తుంది. దీనివల్ల మెదడు కణాలకు ఆక్సిజన్, పోషకాలు అందవు. ఫలితంగా ఆ కణాలు చనిపోతాయి. ఆహారపు అలవాట్లు, వ్యాయామంతో ఈ స్ట్రోక్ ముప్పు నుంచి తప్పించుకోవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఇందుకోసం వెల్లుల్లిలోని ఔషధ గుణాలు బాగా ఉపయోగపడతాయని వివరిస్తున్నారు. వెల్లుల్లిని నమిలినప్పుడు శరీరంలో అల్లిసిన్ అనే సల్ఫర్ ఆధారిత సమ్మేళనం విడుదలవుతుంది. ఇది రక్తనాళ వ్యవస్థను మెరుగుపరుస్తుంది. బ్లడ్ వెసల్స్‌ను ఓపెన్ చేయడంలోనూ అల్లిసిన్ ప్రముఖ పాత్ర పోషిస్తుంది.

**రక్తపోటు:** రక్తపోటు కారణంగా కలిగిన అధిక ఒత్తిడితో రక్తనాళాలు బలహీనపడతాయి. అయితే వెల్లుల్లి ఈ రక్తపోటు తగ్గించడంలో సహాయపడుతుంది.

రక్తం గడ్డకట్టడం: రక్త కణాలు గడ్డకట్టడం వల్ల ఎక్కువగా స్ట్రోక్స్ సంభవిస్తున్నాయి. వెల్లుల్లిలోని ఔషధ గుణాలు నేచురల్ బ్లడ్ థిన్నర్‌లాగా పనిచేసి, రక్తం గడ్డకట్టుకోవడాన్ని అడ్డుకుంటాయని కొన్ని పరిశోధనలు తెలిపాయి.

కొలెస్ట్రాల్: రక్తనాళంలో కొవ్వు, కొలెస్ట్రాల్ పేరుకుపోయి ధమని గోడలు ఇరుకుగా మారుతాయి. అప్పుడు రక్తప్రసరణకు ఆటంకం కలుగుతుంది. ఈ చెడు కొలెస్ట్రాల్ తగ్గించడంలోనూ వెల్లుల్లి ఉపయోగపడుతుంది.

**ఇలా తినాలి.. :** మొదట వెల్లుల్లిని ముక్కలుగా కట్ చేయాలి. వెంటనే వాటిని తినకుండా ఐదు నుంచి పది నిమిషాల వరకు ఆగాలి. ఆ తరువాత ముక్కలను ఒక్కొక్కటిగా తినాలి. పచ్చి వెల్లుల్లిని తినడమే అన్ని విధాల మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఘాటుగా ఉండదని వంటలోని వెల్లుల్లి ముక్కలను మాత్రమే కొందరు తింటున్నారు. కానీ అధిక వేడి వల్ల ఈ రకం వెల్లుల్లిలో అల్లిసిన్ తగ్గిపోవడానికి అవకాశాలున్నాయి. అందుకే పచ్చి వెల్లుల్లినే వినియోగించడం అన్ని రకాలా మంచిదని నిపుణుల అభిప్రాయం.

# టీచ్చర్స్ కాలిని లో గణేష్ నవరాత్రి ఉత్సవాలు



**కోదాడ, సెప్టెంబర్ 20(భద్రాద్రి న్యూస్):** మట్టి విగ్రహాలను పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుకుందాం అనే ఉద్దేశంతో టీచర్స్ కాలనీలో రెండో వార్షికోత్సవ గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడం జరిగింది. టీచర్స్ కాలనీలో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు ప్రత్యేకంగా పూజలు నిర్వహించి, అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించిన టీచర్స్ కాలనీ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్న 28వ వార్డు కౌన్సిలర్ తోట జ్యోతి శ్రీనివాస్, 20వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ జిల్లేపల్లి నాగేశ్వరరావు  అలాగే మట్టి గణనాధుని పూజించి పర్యావరణాన్ని కాపాడుతున్నందుకు, గణేష్ ఉత్సవ కమిటీ నియోజకవర్గ అధ్యక్షులు కోడుమూరి ప్రవీణ్, గౌరవ అధ్యక్షులు చెన్నకేశవరావు,  కమిటీ సభ్యులను ప్రత్యేక ధన్యవాదాలు తెలిపి సన్మానించడం జరిగింది  ఈ కార్యక్రమంలో మహిళలు కమిటీ సభ్యులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాధుని కృపాకటాక్షాలు ఉండాలని కోరుకున్నారు.

# విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు





**కోదాడ, సెప్టెంబర్ 20(భద్రాద్రి న్యూస్):** కోదాడ మండల పరిధిలోని పాత గుడిబండ గ్రామం కమ్యూనిటీ హాల్ వద్ద ఏర్పాటుచేసిన గణేష్ మండపంలో ఆదివారం రిటైర్డ్ ఎస్ ఐ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పులి వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లంబోదరుడికి ధూప దీప నైవేద్యాలతో ,ఫల పుష్పాలతో హారతులతో మంగళకరంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఎస్ ఐ పులి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు ప్రజలలో ఐకమత్యాన్ని పెంపొందిస్తున్నాయని విగ్నేశ్వరుడు ఆటంకాలు లేకుండా సమాజానికి నూతన మార్గాన్ని చూపుతున్నారని తెలిపారు. యువత, విద్యార్థులు తాము ఎంచుకున్న రంగంలో విజ్ఞాధిపతి ఆశీస్సులతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో  ప్రభుత్వ ఉపాధ్యాయులు పులి మైసయ్య, ఏడుకొండలు, పులి నరేందర్, చుక్క సూర్యం,, జర్నలిస్టు పులి నాగరాజు,ఏడుకొండలు, రిటైర్డ్  ఎస్ ఐ పులి వెంకటేశ్వర్లు, పులి శ్రీను, , పులి నరేందర్ ఎల్. శరత్, చుక్క అనిల్,సూరయ్య,వీరేష్,కె రాకేష్ ,రోహన్, కలకొండ శివ,అభి ,పెరుమాళ్ళ ప్రభాకర్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# గణనాథుడి సన్నిధిలో మహా అన్నదానం

**– అప్పాయిగూడెంలో భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు.. ప్రత్యేక పూజలు, అన్నప్రసాద వితరణ**



**కారేపల్లి, సెప్టెంబర్ 20 (భద్రాద్రి న్యూస్ రాములు):** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని కారేపల్లి మండలం అప్పాయిగూడెం గ్రామంలో భక్తిశ్రద్ధలతో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. గణపతి నామస్మరణలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో అప్పాయిగూడెం సర్పంచ్ దండు ప్రవీణ్ పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక చవితి పర్వదినం ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలంతా ఐకమత్యంతో పండుగ వేడుకలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. వినాయక చవితి సందర్భంగా గ్రామంలో భక్తి వాతావరణం నెలకొంది. గణనాథుడిని భక్తిశ్రద్ధలతో పూజిస్తూ గ్రామస్తులు ఐకమత్యంతో ఉత్సవాల్లో పాల్గొన్నారు. భక్తి కార్యక్రమాలతో పాటు అన్నదానం నిర్వహించడం ద్వారా సేవాభావాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, దాతలు, యువత, భక్తులు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# రోటరీ సేవలు మరువలేనివి

**- రోటరీ నేషనల్ బిల్డర్ అవార్డ్స్ ప్రధానోత్సవంలో సింగరేణి జనరల్ మేనేజర్ రామ మోహన్**




**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 20 (భద్రాద్రి న్యూస్) :** కొత్తగూడెం నియోజకవర్గం చుంచుపల్లి మండలం స్థానిక పెన్షనర్స్ భవనము నందు రోటరీ నేషనల్ బిల్డర్ అవార్డ్స్ ప్రధానోత్సవం ఆదివారం నాడు ఘనంగా నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం అధ్యక్షురాలు రొటేరియన్ బూరుగు నీరజ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల స్థాయి నుండి యూనివర్సిటీ స్థాయి వరకు గల ఉత్తమ గురువులను 12 మందిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సింగరేణి ఇడఎం జనరల్ మేనేజర్ కె. రామ మోహన్ ముఖ్య అతిథిగా హాజరైయినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కొత్తగూడెం మరియు ఈ చుట్టుపక్కల గల ప్రాంతాలలో రోటరీ అందించిన సేవలు మరువరానివని పేర్కొన్నారు. నేషన్ బిల్డర్ అవార్డు అందుకోవడం ద్వారా ఉపాధ్యాయులు మరింత బాధ్యతయుతంగా నడుచుకోవాల్సిన అవసరం ఉందని విశిష్ట అతిధి డా. సుధాకర్ తెలియజేసారు. రోటరీ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అబ్రహం మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం రోటరీ ఉత్తమ ఉపధ్యాయులను గుర్తించి ఈ అవార్డులను ప్రధానం చేస్తుందని తెలిపారు. ఒకేషనల్ డైరెక్టర్ రొటేరియన్ పేరం సుజాత మాట్లాడుతూ... ఉపాధ్యాయులనే కాక రోటరీ సంస్థ సమాజములోని అన్ని వృత్తుల వారిని గౌరవిస్తుందని తెలియజేసారు. ఈ కార్యక్రమం లో క్లబ్ అడ్వైజర్ అంకం పాపయ్య, ట్రైనర్ ఆనంద కుమార్, డైరెక్టర్ పేరం సుజాత, జాయింట్ సెక్రటరీ రమాదేవి, క్లబ్ సభ్యులు శేషగిరి రావు, ప్రసన్నకుమార్, రవి కుమార్, బూరుగు శ్రీనివాస్, పోసాని అరుణ, ఉషారాణి, దుర్గారాణి వివిధ విద్యాలయాలఅధిపతులు, ఉపాధ్యాయలు, విశ్రాంత ఉద్యోగుల సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by CHENGAPONGUSAIDULU,and printed at KAKATI BABU PRINTERS H No.4-10.Telagarama varam,Laximidevipally, Kothagudem -507101,Dist .Bhadradri kothagudem, Telangana. And Published At HNo. DA-416,Babu camp,chunchupalli (M), Kothagudem-507101,Dist Bhadradri kothagudem, Telangana.Editor: CHENGAPONGU SAIDULU. RNI TELTEL 2023/90682Call No.6302329046